పోలీస్ గస్తీ ఏర్పాటు చేయాలి



ప్రజలకు నిత్యం వైద్య సేవలందిస్తున్న మాకు రక్షణ ఉండడం లేదు. రోగులకు వైద్య సేవలందించే సమయంలో కొంతమంది తాగి వచ్చి ఆస్పత్రిలో తిరుగుతుంటారు. రెండు నెలల కిందట ఓ వ్యక్తి తాగి వచ్చి గొడవ చేస్తే బుచ్చెయ్యపేట ఎస్‌ఐ దృష్టికి తీసికెళ్లాం. ఆస్పత్రి వద్ద రాత్రిపూట బందోబస్తుతో పాటు పగలు గస్తీ ఏర్పాటు చేయాలి. సీసీ కెమెరాలు,రెస్ట్ రూం,స్టాఫ్ రూం ఏర్పాటు చేయాలి.

– డి.సంధ్యారాణి,తురకలపూడి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు


పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలి



మహిళా వైద్య సిబ్బంది రక్షణ కోసం ప్రభుత్వాస్పత్రుల్లో పోలీసు అవుట్‌పోస్టు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. రాత్రిపూట ప్రమాదాల్లో గాయపడిన వారితో పాటు చాలా మంది గుంపుగా వస్తుంటారు. అనుకోని సంఘటనలు జరిగితే రోగుల సహాయకులు డాక్టర్ల మీద తిరగబడతారు. పోలీస్ అవుట్‌పోస్టు ఉంటే రక్షణగా ఉంటుంది.

-కె. రేవతి వైద్యాధికారి మాడుగుల

వైద్యురాలిపై అత్యాచారం అమానుషం



కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య జరగడం అమానుషం . ఈ సంఘటన వైద్య సిబ్బందిని తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఇటువంటి సంఘటనలను ప్రతి ఒక్కరు ఖండించాలి. దీనికి బాధ్యులను కఠినంగా శిక్షించాలి. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు రక్షణ చర్యలు తీసుకోవాలి.

– ఎల్.వి.ఎస్. ఎస్. ప్రసాదు పాత్రుడు, ప్రధాన వైద్యాధికారి, కేజే పురం పీహెచ్‌సీ

– బుచ్చెయ్యపేట/మాడుగుల/మాడుగుల రూరల్

హక్కు ఉన్నా.. దక్కని చుక్కనీరు

- తుప్పలతో నిండిన పెద్దేరు రిజర్వాయర్ కుడి కాలువ
- లైనింగ్ సరిగా లేక మధ్యలో నిలిచిపోతున్న ప్రవాహం
- ఎర్రవాయి గ్రామాల అన్నదాతలకు తప్పని అవస్థలు
- తాత్కాలికంగా మరమ్మతులు చేసి నీరివ్వాలని కోరుతున్న రైతులు

గతంలో ఇంజినీర్లు చేసిన తప్పిదం ఇప్పటికీ అన్నదాతలను శాపంలా వెంటాడుతోంది...పెద్దేరు రిజర్వాయర్ నుంచి సాగు నీటిని పొందే హక్కు ఉన్నా చుక్కనీరు అందడం లేదు... వరుణుడి కరుణపై ఆధారపడి వంటలు సాగు చేస్తున్నారు... వర్షాలు సకాలంలో కురవక నారుమళ్లు ఎండిపోతున్నాయి... కళ్లలో నీళ్లను నింపుకొని ఆకాశంవైపు చూడడం తప్ప రైతులు ఏమీ చేయలేకపోతున్నారు... వారిని పట్టించుకునే నాథుడే కరవయ్యాడు.



పెద్దేరు రిజర్వాయర్ నీరు చేరని గున్నెంపూడిలో చిన్నాల చెరువు

బుచ్చెయ్యపేట: మండలంలో ఎర్రవాయి గ్రామాలకు పెద్దేరు రిజర్వాయర్ నుంచి సాగు నీరు అందించి సస్యశ్యామలం చేయాలన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కల నెరవేరడం లేదు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎర్రవాయి గ్రామాలకు సాగు నీరు అందించేందుకు రూ.7 కోట్లతో పెద్దేరు కుడి కాలువ తవ్వించారు. అప్పట్లో ఇంజినీరింగ్ అధికారులు కాలువ లైనింగ్ సరిగా చేయించక పోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. దీంతో ఎర్రవాయి గ్రామాల రైతులకు పెద్దేరు రిజర్వాయర్ సాగునీరు అందని ద్రాక్షగా మిగిలిపోయింది. ప్రస్తుతం చుట్టు పక్కల గ్రామాల్లో జోరుగా వర్షాలు కురుస్తున్న ఎర్రవాయి గ్రామాల్లో వర్షాలు సరిగా కురవడం లేదు. మైదాన ప్రాంత గ్రామాల్లో ఇప్పటికే 80 శాతం వరకు వరినాట్లు పడగా ఎర్రవాయి గ్రామాల్లో 30 శాతం కూడా వరినాట్లు వేయలేని పరిస్థితి దాపురించింది. పదిహేనేళ్ల కిందట దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్రలో భాగంగా ఎర్రవాయి గ్రామాల్లో పర్యటించారు. పంటలు పండక పొలాలన్నీ బీళ్లుగా ఉండడం గమనించి రైతులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. ఆయన ముఖ్యమంత్రి అయిన వెంటనే మాడుగుల మండలంలో ఉన్న పెద్దేరు రిజర్వాయర్ నుంచి బుచ్చెయ్యపేట మండలం వరకు కుడి కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. మాడుగుల మండలం రావికం పాడు నుంచి రావిమతం మండలం మేడివాడ మీదగా బుచ్చెయ్యపేట మండలం గున్నెంపూడి చిన్నాల చెరువు వరకు పెద్దేరు కుడి ప్రధాన కాలువను తవ్వించారు.



తుప్పలతో నిండిపోయిన పెద్దేరు కుడి కాలువ

సుమారు 27 కిలోమీటర్ల పొడవున పెదమదీన,కేపీ అగ్రహారం,కొండపాలెం,చినమదీన, బుచ్చెయ్యపేట,ఐయితంపూడి, కందిపూడి,ఐయ్యరకలపాలెం తదితర గ్రామాలకు చెందిన రైతులకు సాగునీరు అందేలా చేశారు. కుడి కాలువ ద్వారా ప్రతి ఏటా సుమారు 2,500 ఎకరాలకు సాగునీరు అందించాలి. అప్పట్లో ఇంజినీరింగ్ అధికార్లు సరైన లైనింగ్ వేయకపోవడంతో పెద్దేరు నీరు విడుదల చేసినా రావికమతం మండలం మరుపాక వద్ద కాలువ పొంగి నీరు ఎర్రవాయి గ్రామాలకు అందడం లేదు. కాలువలో తుప్పలు,డొంకలు పెరిగిపోయాయి. పెద్దేరు నీరు రాకపోవడంతో చెరువుల్లో నీరు లేదు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ వచ్చి మూడు నెలలవుతున్నా వర్షాలు కురవక,పెద్దేరు రిజర్వేయర్ నీరు అందక 30 శాతం వరకే వరినాట్లు పడ్డాయి. ఇప్పటికే వరి ఆకు వేసి నెల రోజులు దాటుతోందని ఆకులు ఏపుగా ఎదిగాయని, పెద్దేరు రిజర్వేయర్ ద్వారా సాగునీరు అందిస్తే దమ్ములు చేసి వరినాట్లు వేసికుంటామని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

70 ఎకరాల్లోనే నాట్లు



ఎర్రవాయి గ్రామాల్లో తగినంత వర్షాలు కురవడం లేదు. వంట దమ్ములు చేసి నాట్లు వేయడానికి సాగునీరు లేదు. ఆగస్టు నెలాఖరు లోగా వరినాట్లు వేయకపోతే ఆకులు ముదిరిపోతాయి. మా గ్రామంలో 150 ఎకరాలకుగాను 70 ఎకరాల వరకు బోర్లు నీరు తోడి వరి నాట్లు వేశారు. నాకు ఉన్న రెండు ఎకరాల్లో అర ఎకరంలో వరి వేశాను. ఇంకా ఎకరంన్నర పొలంలో వరి నాట్లు వేయాలి. పెద్దేరు కుడి కాలువను తాత్కాలికంగానైగా బాగుచేయించి, సాగునీరు అందించి ఆదుకోవాలి.

– కొల్లిమల్ల శ్రీను, పెదమదీన,రైతు సంఘ నాయకుడు

రైతులను ఆదుకోవాలి



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పెద్దేరు రిజర్వేయర్ కుడికాలువ ద్వారా మాకు సాగునీటి హక్కు కల్పించారు. కుడి కాలువ ద్వారా వచ్చే నీరు చెరువుల్లోకి చేరి, అక్కడి నుంచి పంటపొలాలకు చేరాలి. కుడికాలువ సిమెంట్ లైనింగ్ సరిగా లేక నీరు రావడం లేదు. ఇప్పుడు కాలువలో తుప్పలు,డొంకలు పెరిగి పోయాయి. కనీసం తాత్కాలికంగా కాలువకు మరమ్మతులు చేసి, శుభ్రం చేయించి అధికార్లు నీరు విడుదల చేస్తే పంటలు పండుతాయి. సాగు నీరందించే ఏర్పాట్లు చేసి ఎర్రవాయి గ్రామాల రైతులను ఆదుకోవాలి.

– ముచ్చకర్ల అప్పారావు, గున్నెంపూడి రైతు.

క్లుప్తంగా

ఎయిడ్స్ నియంత్రణకు కృషి



వీరవల్లి అగ్రహారంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

మాడుగుల రూరల్: ఎయిడ్స్ నియంత్రణకు అందరూ కృషి చేయాలని లింక్ వర్కర్ స్కీమ్ సీఎల్‌డబ్ల్యూసీ పి.సూర్యకళ అన్నారు. ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో శుక్రవారం వీరవల్లి అగ్రహారంలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకళ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ యలగాడ ఈశ్వరమ్మ, ఈశ్వరావు, పంచాయతీ కార్యదర్శి జగదీష్, సీహెచ్‌వో మాధురి తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

నర్సీపట్నం: ఈ ఏడాది టెన్త్‌లో శతశాతం ఫలితాలు సాధించాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలని యలమంచిలి డిప్యూటీ డీఈవో అప్పారావు ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం ఆయన చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న పలు అంశాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించి, నోట్ పుస్తకాలను తనిఖీ చేశారు. ఇంగ్లిష్‌లో నూటికి నూరు శాతం మార్కులు సాధించేందుకు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సైన్స్ బోధన తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థుల స్థాయిని బట్టి బోధన చేయాలని సూచించారు. విద్యా బోధన, మధ్యాహ్న భోజనం సక్రమంగా ఉండేటట్లు చూసుకోవాలని హెచ్‌ఎం రామకృష్ణారావుకు సూచించారు.

రోడ్డుపై వృథాగా తాండవ నీరు



ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

నాతవరం: ఇరిగేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాండవ రిజర్వాయర్ నీరు వృథాగా ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ప్రవహిస్తోంది. మండలంలో ములగపూడి-బెన్నవరం గ్రామాల మధ్య తాండవ నీరు వృథాగా పోతోంది. ఇక్కడ ఆయకట్టుకు నీరు ప్రవహించే కాలువలు తుప్పలు, పూడికతో నిండిపోవడంతో సాగు నీరంతా రోడ్డుపై వృథాగా పోతోంది. వృథాగా పోతున్న సాగు నీరు గురించి పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఈ ప్రాంత రైతులు తెలిపారు. రోడ్డుపై నిత్యం నీరు ప్రవహిస్తుండడంతో పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారుల పర్యవేక్షణలోపం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైన తాండవ ప్రాజెక్టు అధికారులు స్పందించి కాలువలో పూడిక తీయించి, నీటి వృథాను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.



తుప్పలతో నిండిపోయిన తాండవ కాలువ

మొక్కుబడిగా గ్రామసభలు



చోడవరం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు



కొరువాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

చోడవరం: ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా నిర్వహించిన గ్రామసభలు మొక్కుబడిగా జరిగాయి. మండలంలో 32 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. స్థానిక సమస్యలు, ఇతర మౌలిక సదుపాయల కోసం ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. చాలా చోట్ల సభను ప్రారంభించిన కొద్ది సమయానికే మండలస్థాయి అధికారులు అక్కడ నుంచి వేరే సభలకు వెళ్లిపోయారు. స్థానిక పంచాయతీ కార్యదర్శులకు సభ నిర్వహణ అప్పగించారు.

కె.కోటపాడు : గ్రామాల అభివృద్ధిని ప్రాధాన్యతా క్రమంలో చేపట్టేందుకు పూర్తిగా సహకరించనున్నట్టు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. కొరువాడలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఆయన మాట్లాడారు.

మాడుగుల: నియోజకవర్గంలో 111 పంచాయతీల్లో శుక్రవారం సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. మాడుగుల మండలంలో 29 పంచాయతీలు, కె.కోటపాడు మండలంలో 32 పంచాయతీలు, దేవరాపల్లి మండలంలో 27 పంచాయతీలు, చీడికాడ మండలంలో 23 పంచయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు.

గ్రామ సభలను సద్వినియోగించికోండి

బుచ్చెయ్యపేట : జాతీయ ఉపాధి హామీ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని డీపీవో శిరీషారాణి తెలిపారు. శుక్రవారం వడ్డాదిలో జరిగిన గ్రామ సభలో ఆమె ప్రజల నుంచి వినతులను స్వీకరించి, మాట్లాడారు.

ఉపన్యాసాలతో సరి...

నర్సీపట్నం: నియోజకవర్గంలో నర్సీపట్నం, నాతవరం, మాకవరపాలెం,గొలుగొండ మండలాల్లోని 101 పంచాయతీల్లో గ్రామ సభలు జరిగాయి. గ్రామస్తులు అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా అధికారుల ఉపన్యాసాలతో సరిపెట్టారు. టీడీపీ నాయకులు సూచించిన పనులకు అధికారులు ప్రాధాన్యత ఇచ్చారు.

ఇళ్ల నిర్మాణాలకు ఆటంకం లేకుండా చూడాలి

దేవరాపల్లి: స్థానిక సంతతోటలోని సర్వే నంబర్ 175/4 ప్రభుత్వం స్థలంలో తాము నిర్మించుకుంటున్న ఇళ్ల నిర్మాణాలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని సంతతోటకు చెందిన స్థానికులు కోరారు. ఈ మేరకు దేవరాపల్లిలో శుక్రవారం జరిగిన గ్రామ సభలో సచివాలయ కార్యదర్శి రత్నంకు వినతి పత్రం అందజేశారు.

మాకవరపాలెం ఎంపీపీగా లక్ష్మి నియామకం



రుత్తల లక్ష్మి

మాకవరపాలెం: మాకవరపాలెం ఎంపీపీగా వైస్‌ఎంపీపీ రుత్తల లక్ష్మి నియమితులయ్యారు.ఇప్పటివరకు ఎంపీపీగా ఉన్న రుత్తల సత్యనారాయణ గత నెల 31న రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.ఈనేపథ్యంలో వైస్‌ఎంపీపీ అయిన తామరం ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మిని ఎంపీపీగా నియమిస్తూ ఉత్తర్వులు అందినట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. ఎంపీపీ ఎన్నికల నిర్వహించే వరకు ఈమె ఎంపీపీగా పూర్తి బాధ్యతలు నిర్వర్తిస్తారన్నారు.

ఆంధ్రకేసరికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

రోలుగుంట: మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు.కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రకాశం పంతులు చిత్రపటానికి హెచ్‌ఎం మోహన్, అప్పనరాంబాబు, రోలుగుంటలో హెచ్‌ఎం ప్రసాద్, సీనియర్ ఉపాధ్యాయుడు శర్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహిళలపై అత్యాచారాలను అరికట్టాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్‌ఐ, ఐద్వా నాయకులు, విద్యార్థులు



ఆర్డీవో జయరాంకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

నర్సీపట్నం: మహిళలు, విద్యార్థినులు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని ఎస్ఎఫ్‌ఐ జిల్లా ప్రెసిడెంట్ గీతాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలపై అత్యాచారాలను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేవారు. దాడులను అరికట్టి, దోషులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఆర్డీవో హెచ్.వి.జయరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గీతాకృష్ణ మాట్లాడుతూ మహిళలపై అత్యాచారం ఘటనలు నానాటికి పెచ్చుమీరుతున్నాయన్నారు. అత్యాచారాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు పోక్సో, నిర్భయ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాంబిల్లి మండలంలో తొమ్మిదో తరగతి బాలికపై జరిగిన అత్యాచార ఘటనలో నిందితుడిని వదిలేశారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు జనార్దన్, స్వామి, రవి, భూషణ్, గణేష్, సాయి, దుర్గా, శివ, మణికంఠ, జయకృష్ణ, మోహన్, మహేష్, డివైఎఫ్ఐ డివిజన్ నాయకులు గౌతమ్, ఐద్వా నాయకులు గౌరీ, కె వి.పి.ఎస్. నాయకులు చిరంజీవి, సీఐటీయూ నాయకులు రాజు, ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు వరహాలు, దుర్గాస్వామి, రవి, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

నాతవరం: నాతవరం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని శనివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో హనుమంతరావు తెలిపారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు అధికారులు హాజరుకావలన్నారు.

మలేరియా ప్రబలకుండా చర్యలు



ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా మలేరియా అధికారి వరహాలు దొర



శృంగవరంలో కిశోర బాలికకు వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యాధికారి శైలజ

మాడుగుల రూరల్: గ్రామాల్లో మలేరియా జ్వరాలు ప్రబలకుండా ప్రజలు తగు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కిముడు వరహాలుదొర సూచించారు. మండలంలో ఎం. కె. వల్లాపురంలో శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఐ.రంజిత్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్యామిలీ పిజీషియన్ ద్వారా గ్రామాల్లో ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు 120 మంది రోగులను పరీక్షించారు. కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి కె. లీలాప్రసాదు, చోడవరం మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఎస్.వి.రమణ, ఎస్.కుమార్ ఆంజనేయులు, స్థానిక ఆరోగ్య సహాయకులు పి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

కె.కోటపాడు : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ తెలిపారు. శృంగవరంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ నిర్వహించి, 127 మందికి వైద్య పరీక్షలు జరిపారు. గర్భిణులు తీసుకోవలసిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. హెల్త్ అసిస్టెంట్ నర్సింహమూర్తి, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అంతరిక్ష దినోత్సవం



చంద్రయాన్ నమూనా ప్రదర్శన

మాకవరపాలెం: తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రయాన్ నమూనాను ప్రదర్శించి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం రాము మాట్లాడుతూ చంద్రయాన్‌లో భాగంగా త్రివిక్రమ్ ల్యాండర్‌ను చంద్రుడిపై దింపిన సందర్భంగా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరపాలని కేంద్రం ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలలో అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించినట్టు చెప్పారు. పాఠశాలలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి, నారాయణరావు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణలక్ష్మి పూజలు



జంపనలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు



చౌడువాడ దుర్గాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కేజే పురం జంక్షన్ సంతోషిమాత ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల: మండలంలోని జంపెనలో వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. మాడుగుల, జంపెన, గాదిరాయి, సత్యవరం, జేడీపేట, కింతలి గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

దుర్గాదేవి ఆలయాల్లో

కె.కోటపాడు: శ్రావణమాసం మూడవ శుక్రవారం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో దుర్గాదేవీ ఆలయాల్లో మహిళలు పూజలు నిర్వహించారు. చౌడువాడ, ఎ.కోడూరు, పిండ్రంగి, గుల్లేపల్లి గ్రామాల్లోని దేవీ ఆలయాలతో పాటు కె.కోటపాడులో గల కామాక్షమ్మ ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు.

సంతోషిమాత ఆలయంలో...

మాడుగుల రూరల్: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని, కేజే పురం జంక్షన్‌లో గల సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో సుమారు 2,000 మంది పాల్గొన్నారు. పాలకుర్తి అరుణ్‌కుమార్, వసుంధర దంపతుల ఆర్థిక సాయంతో అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లి నాయుడు పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు దొంతుకుర్తి శ్రీనివాసశర్మ భక్తులతో అభిషేకాలు చేయించారు.

లక్కవరంలో గ్రంథాలయం ఏర్పాటుకు చర్యలు



గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ చేసిన మూర్తి

చోడవరం రూరల్: లక్కవరంలో నూతనంగా గ్రంథాలయం ఏర్పాటు చేయడానికి ఎస్పీపీఎల్ సొసైటీకి చర్యలు చేపట్టింది. శుక్రవారం సొసైటీ అధ్యక్షుడు పి.ఎస్.ఎస్.మూర్తి.. యాక్టింగ్ సర్పంచ్ శీరంరెడ్డి వెంకట రమణ ఆధ్వర్యంలో పెద్దలతో సమావేశమయ్యారు. జిల్లా గ్రంథాలయ సంస్థ నిర్వాహకులతో సంప్రదించి బుక్ డిపాజిట్ సెంటర్ ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని సొసైటీ ప్రతినిధులు మూర్తి, డి.మురళీధర్‌లు తెలిపారు. మొదటి విడతగా వందకు పైగా పుస్తకాలను వారు రమణకు అందచేశారు. ఉప సర్పంచ్ బి.సింహాచలంనాయుడు, పాల సంఘం కార్యదర్శి సన్నిబాబు, వెంకటలక్ష్మి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.